నమస్తే తెలంగాణ

రాజన్న సిరిసిల్ల

5 కరీంనగర్, బుధవారం 21 ఫిబ్రవరి 2024 RAJANNA SIRCILLA




కరీంనగర్‌లో అగ్ని ప్రమాద స్థలంలో గుమిగూడిన జనం, మంటలను ఆర్పుతున్న సిబ్బంది

# బతుకులు బుగ్గిపాలు

## కరీంనగర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- కాలిబూడిదైన పేదల గుడిసెలు
- పేలిన వంట గ్యాస్ సిలిండర్లు
- రంగంలోకి ఫైర్ సిబ్బంది, పోలీసులు
- గంటలోనే అదుపులోకి..
- ₹30 లక్షల ఆస్తి నష్టం అంచనా
- బాధితులు మేడారం వెళ్లడంతో తప్పిన పెనుముప్పు



ఏడుస్తున్న బాధితులు

కరీం'నగరం' ఉలిక్కిపడింది. ఇందిరానగర్, ఆదర్శనగర్ మధ్య మంగళవారం మధ్యాహ్నం జరిగిన భారీ అగ్నిప్రమాదం భయపెట్టింది. ఎక్కడి నుంచో ఇక్కడికి వచ్చి కూలి పనిచేసుకొని బతికే పేదల గుడిసెలను బుగ్గిపాలు చేసింది. అదృష్టవశాత్తూ బాధితులంతా మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లడంతో ప్రాణ నష్టం తప్పింది. ఓవైపు మంటలు ఎగిసిపడడం, మరోవైపు సిలిండర్లు పేలడం చూసి చుట్టుపక్కల ప్రాంత ప్రజలు వణికిపోగా, అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు చాకచక్యంగా వ్యవహరించి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ)/రాంనగర్: నగరంలోని ఇందిరానగర్, ఆదర్శనగర్ మధ్యన ఉన్న ఓ ప్రైవేట్ స్థలాన్ని అద్దెకు తీసుకుని కొందరు వలస కూలీలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారు. 20 నుంచి 25 ఏండ్లుగా వీళ్లు తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని భవన నిర్మాణాలకు మట్టిపనులు చేస్తున్నారు. సుమారు 30గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వీరు మంగళవారం సమ్మక్క, సారలమ్మ జాతర కోసం మేడారం వెళ్లారు. ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి 21గుడిసెల వరకు కాలి బూడిదయ్యాయి. అందులో ఉన్న కూలీల నిత్యావసరాలు, బట్టలు, నగలు, నగదు కూడా దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణం ఇదమిద్దంగా తెలియకపోయినా.. ఏదో ఒక గుడిసెలో దేవుడి ఫొటో వద్ద వెలిగించిన దీపం కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంలో మూడు బైక్‌లు కూడా దగ్ధమైనట్లు చెబుతున్నారు. మొత్తంగా ₹30 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు.

### గంటలోనే అదుపులోకి మంటలు

అగ్ని ప్రమాదం జరిగిన చోట గంట పాటు తీవ్రమైన భయాందోళన నెలకొన్నది. చెలరేగుతున్న మంటలను చూసి స్థానికులు వణికిపోయారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక అధికారులు రంగంలోకి దిగారు. అగ్ని మాపక అధికారి తగరం వెంకన్న స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. సిబ్బంది ఫైర్ సేఫ్టీ ద్వారా మంటలను గంటలోనే పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఒక దశలో మంటలను ఆర్పేందుకు కష్టం కావడంతో జగిత్యాల ఫైర్ యూనిట్లను కూడా పిలిపించారు. గుడిసెల్లో ఒకదాని వెనుక మరొకటి ఎనిమిది సిలిండర్లు పేలగా, మిగతా సిలిండర్లు పేలకుండా జాగ్రత్తపడ్డారు. గుడిసెలను చుట్టుముట్టిన మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా తీవ్ర ప్రయత్నాలు చేశారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ వాటర్ ట్యాంకర్లకు మోటర్లు బిగించి మంటలను అదుపు చేయగలిగారు. మరో తొమ్మిది గుడిసెలకు మంట అంటకుండా నిలువరించారు. గుడిసెలు దగ్ధమైన ప్రదేశానికి అతి చేరువలో రెనే ప్రైవేట్ దవాఖాన ఉండడంతో ఇటు వైపు మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ త్రీటౌన్ సీఐ శ్రీనివాస్‌తోపాటు మున్సిపల్, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో పాలు పంచుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది చూపిన తెగువను కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు స్థానిక కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు

### బాధితులను ఆదుకోవాలి : ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కార్పొరేషన్, ఫిబ్రవరి 20 : అగ్ని ప్రమాదంలో నష్టపోయిన కూలీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులంతా మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పారు. 20 నుంచి 25 ఏండ్లుగా ఈ వలస కూలీలు ఇక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారన్నారు. ప్రమాదంలో గుడిసెలు కోల్పోయిన వారికి తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ.లక్ష అందించాలని, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అగ్ని ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులంతా సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. సకాలంలో మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బందిని ఆయన అభినందించారు. మంటలు ఆర్పేందుకు స్థానిక మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్ మేచినేని వనజా అశోక్‌రావు ఇద్దరు చేసిన సహాయాన్ని మెచ్చుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని కూడా అభినందించారు.

# సమ్మక్క జాతర పోయొద్దమా..



రేకుర్తిలోని సమ్మక్క-సారలమ్మ జాతరకు ఏర్పాట్లు చేసిన అధికారులు

### నేటి నుంచే వన దేవతల వేడుక

'తల్లీ వస్తున్నాం.. నిలువెత్తు బంగారం తెస్తున్నాం..' అంటూ తరలివచ్చే భక్తులతో నేటి నుంచి దారులన్నీ సమ్మక్క దిక్కే సాగనున్నాయి. బుధవారం పిల్ల సారలమ్మ రాకతో జిల్లా అంతటా 'వన'దేవతల జాతరకు తెరలేవనుండగా, నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జనసంద్రం కానున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కోల్ బెల్ట్‌తోపాటు గోలివాడ, నీరుకుళ్ల, కొలనూర్, రేకుర్తి, వీణవంక, కేశవపట్నం, హుజూరాబాద్‌లో జాతర వేడుకకు ఇసుకేస్తే రాలనంత జనంతో తరలిరానుండగా, యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేస్తున్నది. ఇప్పటికే తుది దశకు చేరగా, అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు.

– కరీంనగర్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 20



ముత్తారం రీచ్ వద్ద ఇసుక కోసం బారులు తీరిన లారీలు

# మానేరు పొడవునా ఇసుక తోడేళ్లు



ఇసుక లారీలతో దుమ్మురేగుతున్న మంథని-ఓడేడు రోడ్డు

- జోరుగా ఇసుక అక్రమ దందా
- ముత్తారం మండలంలో అర్ధరాత్రి రవాణా
- ఇసుక మేటల మాటున తరలింపు
- అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయనే ఆరోపణలు
- అధికారయంత్రాంగం తీరుపై విమర్శలు
- బెంబేలెత్తుతున్న వినియోగదారులు

ఉమ్మడి జిల్లాలో ఇసుక దందా జోరుగా నడుస్తున్నది. మానేరు నది పొడువునా యథేచ్ఛగా సాగుతున్నది. అధికార పార్టీ నాయకుల అండదండలతో అక్రమార్కులు పెట్రేగి పోతున్నట్లు తెలుస్తుండగా, అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. పేరుకు మాత్రమే ఆన్‌లైన్ అని కనిపిస్తున్నా.. అడుగడుగునా అక్రమాలే జరుగుతున్నాయి. ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో ఇసుక మేటలు తొలగింపు కోసం తీసుకున్న అనుమతుల మాటున మానేరు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. అంతేకాదు, పలు క్వారీల్లో గుత్తాధిపత్యం చేస్తూ.. ఇసుక ధరలు అమాంతం పెంచుతున్నారు. కొన్నిచోట్ల పోలీసులే అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వస్తుండగా, మొత్తంగా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక తీసుకునేందుకు ఉమ్మడి జిల్లావాసులకు అన్ని సౌకర్యాలు ఉన్నా.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతున్నది.

కరీంనగర్, ఫిబ్రవరి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రస్తుతం ఇసుక ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. దాంతో కొనుగోలుదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నేళ్లుగా లేని ఈ సమస్య ఉమ్మడి జిల్లాలో ఇప్పుడే ఎందుకు ఉత్పన్నమవుతున్నది? దీనికి కారణం ఎవరు? లోపం ఎక్కడ? అన్నదే ప్రస్తుత ప్రధాన అంశంగా నిలుస్తున్నది. గోదావరి ఉపనది అయిన మానేరు పరీవాహక ప్రాంతం 90 శాతం ఉమ్మడి జిల్లాలోనే ఉంటుంది. గతంలో మానేరు పొడవునా.. అంటే రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి పెద్దపల్లి జిల్లా వరకు అనేక క్వారీలు నడేచేవి. వివిధ కారణాలతో చాలా వరకు బందయ్యాయి. ప్రస్తుతం కొన్ని మాత్రమే అధికారికంగా నడుస్తుండగా.. మరి కొన్ని అక్రమంగా నడుస్తున్నాయి. నిజానికి మానేరు పొడవునా నీరు తగ్గిపోవడంతో పలు చోట్ల క్వారీలకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం కొత్తవాటికి పర్మిషన్ ఇవ్వకుండా.. ఉన్న క్వారీలను మాత్రమే నడిపిస్తున్నది. ఇదే అదనుగా అక్రమార్కులు ఇసుక కొరతను సృష్టించి అందిన కాడికి దండుకోవడం కనిపిస్తున్నది. నిజానికి ఆన్‌లైన్ అనుమతుల ద్వారా తరలుతున్న ఇసుక కన్నా, అనధికారికంగా తరలుతున్న ఇసుకే అధికంగా ఉన్నది. ఈ వ్యవహారంలో కొంత మంది అధికార పార్టీ నాయకులే ప్రముఖ పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మానేరు పొడవునా 32 చోట్ల అనధికారిక క్వారీలు నడుస్తున్నాయి. ఈ దందా అంతా అర్ధరాత్రి పూట జరుగుతున్నది. రాత్రి పన్నెండు గంటల నుంచి తెల్లవారు జామున ఐదు గంటల వరకు నిరాటంకంగా నడుస్తున్నది. దీని గురించి చాలా చోట్ల అధికారులకు తెలిసినా ఒత్తిళ్లతో పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఈ తరహా దందా ఎక్కువగా నడుస్తున్నది. ప్రధానంగా ఇసుక అక్రమ దందా గురించి పలుచోట్ల పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.



మంథని- ఓడేడు రోడ్డుపై నిలిచిన ఇసుక లారీలు

### ఇసుక మేటల మాటున..

గతంలో వచ్చిన గోదావరి వరద ప్రవాహానికి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని వందలాది మంది రైతుల పొలాల్లో ఇసుక మేటలు పెట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగానే సదరు రైతులు తమ పొలాల నుంచి ఇసుక మేటలను తొలగించుకునేందుకు అనుమతి తీసుకున్నారు. అయితే అక్రమార్కులు ఈ మేటలను సైతం వదలడం లేదు. రైతుకు నామమాత్రంగా డబ్బులు చెల్లించి.. సదరు మేటల ఇసుకను వ్యాపారులే తరలిస్తున్నారు. పేరుకు రైతులే తొలగిస్తున్నట్లుగా కనిపిస్తున్నా, జరుగుతున్న వ్యాపారమంతా అక్రమంగానే సాగుతున్నది. దీనికితోడు మేటల మాటున కొంత మంది అధికార పార్టీ నాయకులు ఏకంగా అక్కడి పరీవాహక ప్రాంతంలోని మానేరు ఇసుకను సైతం అక్రమంగా రవాణా చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ముత్తారం మండలం ఓడేడ్ గ్రామ పరిధిలోని మానేరు నుంచి ఇసుకను తరలించేందుకు ఏకంగా మానేరులోకి రహదారి నిర్మించారు. అక్కడి నుంచి ఇసుకను రాత్రి పూట ఉమ్మడి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి అర్ధరాత్రి సమయంలో పెద్దఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు.

### క్వారీల్లో కొత్త తరహాలో..

అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లి, జిల్లెల్లపల్లి, ముత్తారం, ఓడేడ్ అలాగే మల్హర్ మండలంలో కొన్ని ఇసుక క్వారీలకు అధికారికంగా అనుమతి ఉన్నది. వీటి పరిధిలోనూ నయా దందాకు తెరలేపినట్టు తెలుస్తున్నది. రోజుకు ఎక్కువ వాహనాల్లో ఇసుక నింపడానికి అవకాశమున్నా.. కొంతమంది కాంట్రాక్టర్లు మాత్రం మార్కెట్‌లో కొరత సృష్టించి రేట్లు పెంచడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. కొద్ది రోజులుగా నిత్యం కొన్ని వాహనాల్లో మాత్రమే ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఉదాహరణకు చూస్తే.. గతంలో ఒక క్వారీలో వంద వాహనాల్లో ఇసుక నింపితే.. ఇప్పుడు 30 నుంచి 50కే పరిమితం చేశారు. దీనివల్ల మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్ పెరుగుతున్నది. ఈ దందా అంతా అధికారులకు తెలిసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండగా, ఈ ప్రాంతానికి వస్తున్న వాహనాలు రెండు రోజులపాటు ఇక్కడ ప్రధాన రహదారుల వెంట నిలిచిపోతున్నాయి. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతున్నది. మంథని-ఓడేడ్ రోడ్డు మొత్తం ఇసుక లారీలతో నిలిచిపోతున్నది. ఈ ప్రాంతం గుండా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

### నిబంధనలు బేఖాతరు

ఎక్కడికక్కడ రోడ్లు దుమ్మురేగుతున్నా సదరు కాంట్రాక్టర్లు ఎవరూ పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం రహదారులపై దుమ్ము లేవకుండా అధికారులు నీళ్లు చల్లించాలి. కాలుష్యం ఇబ్బంది కాకుండా చూడాలి. కానీ, ఈ విషయాన్ని కొద్ది రోజులుగా పూర్తిగా విస్మరించారు. దీంతో ఈ ప్రాంతంలో ఎటు చూసినా దుమ్ముతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పెద్దపల్లి జిల్లా నుంచి అర్ధరాత్రి పూట అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక వాహనాల వల్ల తమ పంటపొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ముత్తారం మండలంలో ఇసుక వాహనాలను రైతులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంతోపాటు డిమాండ్‌కు తగినంత సరఫరా చేయడంపై దృష్టి పెడితే నిర్మాణాదారులకు ఊరట లభిస్తుంది. అంతేకాదు, అక్రమార్కులపై ఉక్కు పాదం మోపి.. నిబంధనల ప్రకారం నడిపితే ఇసుక రేట్లు తగ్గి, కొనుగోలుదారులకు భారం తగ్గుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## శాతవాహన యూనివర్సిటీకి ₹20 కోట్లు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 20 : శాతవాహన విశ్వవిద్యాలయానికి ప్రధానమంత్రి ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ కింద ₹20 కోట్లు మంజూరయ్యాయని వీసీ ఆచార్య మల్లేశ్ సంకసాల, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023లో పీఎం ఉషా (ఉచ్ఛతర్ శిక్షా అభియాన్), రూసా (రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్) కింద ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు మంగళవారం దేశంలోని 78 యూనివర్సిటీలకు నిధులు మంజూరు చేశారు. అందులో శాతవాహనకు ₹20 కోట్లు కేటాయించారన్నారు. ఈ సందర్భంగా వీసీ మల్లేశ్ మాట్లాడుతూ, వివిధ పథకాల కింద నిధులు మంజూరు కావాలంటే యూనివర్సిటీకి 12(బీ) హోదా ఉండాలన్నారు. ఈ హోదా ఇచ్చిన సమయంలో యూజీసీ న్యాక్ గ్రేడింగ్ సాధించాలనే షరతు విధించారని చెప్పారు. న్యాక్ గ్రేడ్ ఉంటే ₹100 కోట్లు అదనంగా మంజూరయ్యేవని తెలిపారు. కాగా, ₹20 కోట్లలో ₹10 కోట్లు భవనాలకు, ₹6 కోట్లు నూతన ఆవిష్కరణలకు, ₹4 కోట్లు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కోసం వినియోగిస్తామని వివరించారు.

### పసుపు @ ₹13,555

మెట్‌పల్లి, ఫిబ్రవరి 20 : పసుపు ధరలు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. ఈ సారి దిగుబడులు కాస్త తగ్గినా.. రేట్లు మాత్రం రోజు రోజుకూ పైపైకి ఎగబాకుతున్నాయి. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయ, విక్రయాలు జోరుగా సాగుతుండగా, మంగళవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹13,555 పలికింది. పసుపు కాడి (కొమ్ము)కు ఈ ధర పలుకడం ఈ సీజన్‌లో ఇదే తొలిసారి కాగా, కనిష్ఠంగా ₹4,012 వచ్చింది. పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹11,111, కనిష్ఠంగా ₹5,012, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹12వేలు, కనిష్ఠంగా ₹7,111 పలికింది. ఇప్పటి వరకు మార్కెట్‌లో 1601 క్వింటాళ్ల పసుపు క్రయ, విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

### ఎలిగేడులో జాతీయ వైద్యబృందం


ఎలిగేడు, ఫిబ్రవరి 20: ఇటీవల ఎలిగేడు పీహెచ్‌సీతోపాటు సుల్తాన్‌పూర్, ధూళికట్ట సబ్‌సెంటర్లకు 'కాయకల్ప'కు ఎంపిక కాగా, మంగళవారం జాతీయ వైద్య బృందం సభ్యులు ఆయా దవాఖానలను పరిశీలించారు. ఈ హాస్పిటళ్ల నిర్వహణ, ప్రజలకు అందుతున్న వైద్యం, రికార్డులను పరిశీలించారు. ఎలిగేడు పీహెచ్‌సీలో వైద్యురాలు నిస్సీక్రిస్టినా, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రాజేశ్వరీదేవి, వైద్యారోగ్య సిబ్బందిని అభినందించారు. మెరుగైన వైద్యం అందించేందుకు మరిన్ని సూచనలు సలహాలను చేశారు. ఇక్కడ బృందం వైద్యులు పల్లవి, అన్నారావు, కృతిమాన్ మహంతతోపాటు హెల్త్ సబ్ సెంటర్ల వైద్యసిబ్బంది ఉన్నారు.

## గురుకుల స్కూల్లో విద్యార్థిపై దాడి

వెల్గటూర్, ఫిబ్రవరి 20: స్తంభంపల్లి మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిపై గుర్తు తెలియని వ్యక్తులు బెడ్‌షీట్ కప్పి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి తల్లి, బంధువుల కథనం ప్రకారం.. స్తంభంపల్లి గురుకుల పాఠశాలలో పెగడపల్లి మండలం నంచర్లకు చెందిన జానకీరాం 8వతరగతి చదువుతున్నాడు. అయితే సోమవారం రాత్రి హాస్టల్‌లో జానకీరాం పడుకున్నాక గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి బెడ్‌షీట్ కప్పి వీపుపై వాతలు వచ్చేలా కొట్టారు. తర్వాత లేచి చూస్తే ఎవరూ కనిపించలేదు. ఈ క్రమంలో దెబ్బల నొప్పి భరించలేక మంగళవారం మధ్యాహ్నం హాస్టల్ గోడదూకి పారిపోయాడు. ఆ కాసేపటికే విద్యార్థి కనిపించకపోవడంతో ఉపాధ్యాయులు కంగారుపడ్డారు. ఎక్కడికి వెళ్లారో తెలియక వెతికారు. సమాచారం మేరకు తల్లి మమత, బంధువులు పాఠశాలకు చేరుకొని తమ కొడుకు జాడచూపాలని డిమాండ్ చేశారు. వార్డెన్, టీచర్ల నిర్లక్ష్యానికి నిరసనగా ఆందోళన చేశారు. కానీ అంతలోనే జానకీరాం తన ఇల్లు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఇంటికి వెళ్లి తల్లి తన కొడుకు శరీరంపై దెబ్బలు చూసి కన్నీరుమున్నీరైంది. హాస్టల్‌లో తన కొడుకుపై దాడి జరిగినా వార్డెన్లు, సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంపై మండిపడింది. విద్యార్థి తండ్రి బతుకుదెరువు నిమిత్తం దుబాయ్‌లో ఉన్నాడు. కాగా, ఘటనపై ప్రిన్సిపాల్ రాజేశంను వివరణ కోరగా, హాస్టల్‌లో రాత్రిపూట విద్యార్థులు గొడవపడ్డారని, ఒకరినొకరు కొట్టుకున్నట్టు తెలిసిందన్నారు. అలాగే తల్లిదండ్రుల బెంగతో విద్యార్థి ఇంటికి వెళ్లిపోయినట్లు తెలిపారు.

## ప్రాణం తీసిన కరెంట్ కంచె

- వన్యప్రాణుల నుంచి మక్క చేను రక్షణకు ఏర్పాటు
- తొలగించే క్రమంలో షాక్‌తో మృతి
- సూరారంలో విషాదం



రాజేశం (ఫైల్)

వెల్గటూర్, ఫిబ్రవరి 20: అడవిపందుల బెడద నుంచి మక్క చేనును కాపాడుకునేందుకు తాను పెట్టిన కరెంట్ కంచెకు తగిలి ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలం సూరారం గ్రామానికి చెందిన చెల్పూరి రాజేశం (53) తనకున్న ఐదెకరాల చేనులో నాలుగెకరాలు మక్క, ఎకరం వరి వేశాడు. అడవి పందుల బెడద ఎక్కువ ఉండడంతో తాను వేసుకున్న మక్కను కాపాడుకునేందుకు చేను చుట్టూ జే వైర్‌తో కంచెను ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతి రోజూ సాయంత్రం కరెంట్‌కు కనెక్షన్ ఇచ్చి, తిరిగి ఉదయం తొలగించే వాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం 6 గంటలకు చేను వద్దకు వెళ్లాడు. కరెంట్ కనెక్షన్ తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తూ దానిని తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని ఘటనా స్థలాకి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి సీఐ నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రైతులు పంటలను కాపాడుకునేందుకు కరెంట్ కంచెలు ఏర్పాటు చేసుకోవద్దని, దానికి బదులు ప్రత్యామ్నయ మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేదంటే ఇలాంటి ప్రమాదాలు జరుగుతాని చెప్పారు. ఇలాంటి చర్యలతో ఇతరులు మృతిచెందితే చట్టం ప్రకారం పదేండ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

## కరోనా కాలంలో పనిచేశాం.. ఆదుకోండి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు తొలగించిన నర్సింగ్ స్టాఫ్ వినతి

వేములవాడ, ఫిబ్రవరి 20: 'కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించాం. ఇప్పుడు ఉన్నపలంగా తొలగించడం అన్యాయం. మాకు ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోండి' అంటూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు తొలగించిన నర్సింగ్ స్టాఫ్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల రెగ్యులర్ స్టాఫ్ నర్సులు విధుల్లో చేరడంతో వేములవాడ ఏరియా దవాఖానలో ఔట్‌సోర్సింగ్‌పై పనిచేస్తున్న 14 మందిని తొలగించారని మంగళవారం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మూడేండ్లుగా పనిచేస్తున్న తమను సోమవారం నుంచి విధులకు హాజరుకావద్దని అధికారులు ఆదేశించారని తిర్మాజ, ఎం జ్యోతి, బీ జ్యోతి, రూత్, దీపిక, శ్రీలత, బాలకిషన్, మమత, శ్రీలత, రాజేశ్వరి, ప్రవీణ్, జ్యోత్స్న, జ్యోతి, ఏఎన్ఎం జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా ఖాళీగా ఉన్నచోట సర్దుబాటు చేయాలని కోరారు. తొలగించిన నర్సింగ్ స్టాఫ్‌ను వెంటనే వేరే చోట సర్దుబాటు చేసి ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వైభవంగా వసంతోత్సవం



అభిషేక జలం తీసుకువస్తున్న మంత్రి పొన్నం తదితరులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 20: మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం మహాపూర్ణాహుతి, సాయంత్రం వసంతోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులు, వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో ఉడుతల వెంకన్న, అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, వేంకటేశ్వరస్వామి రథోత్సవం బుధవారం సాయంత్రం మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమవుతుందన్నారు. వీటితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.